**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేది.29.04.2018.**

# మైనర్లకు మోటారు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు హితవు చెప్పాలి

రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణం, రోడ్డు ప్రమాదాల నివారణ అదే విధంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతపై వాహనచోదకులకు మరియు ప్రజలకు అవగాహన కలిగించడం ద్వారా ట్రాఫిక్ నియమాలు పాటించి క్రమశిక్షణ తీసుకురావాలనే ప్రయత్నంలో భాగంగా విజయవాడ నగర పోలీసు శాఖ కృషి చేస్తుంది.

ఈ నేపథ్యంలో రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గత కొద్ది రోజులుగా విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు వివిధ కార్యక్రమాల ద్వారా రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతపై వాహన చోధకులకు అదే విధంగా ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతోంది.

అవగాహన కార్యక్రమాలు చేస్తున్న సమయంలో లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా, వాహనాలు నడుపుతున్న కొందరు మైనర్లను గుర్తించి వారికి అవగాహన కలిగించడంతో పాటు మోటారు వాహనాల చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరిగింది. ఒక దశలో వాహనాన్ని నిలిపే ప్రయత్నం చేసిన పోలీసు వారిని ఖాతరు చేయని సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.

ఈ నేపథ్యంలో ది.28.04.2018న మధురానగర్ వద్ద సీటుబెల్టు లేకుండా కారును నడుపుతున్న ఒక బాలికను పోలీసు వారు ఆపడం జరిగింది. అయితే ఆ బాలిక కారును ఆపకుండా పోలీసు వారి మీదుగా పోనిచ్చే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆ బాలికను అడ్డుకుని పరిశీలించగా ఆ బాలికకు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోగా, మైనర్‌గా గుర్తించడం జరిగింది. ఈ నేపథ్యంలో సంబంధిత బాలిక తండ్రిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తన కుమార్తెకు కారును ఇచ్చినందుకు గాను అతడిపై కేసు నమోదు చేయడం జరిగింది.

తనిఖీల సమయంలో పోలీసు వారు గుర్తించిన కొంత మంది మైనర్ల తల్లిదండ్రులు వారి పిల్లలు వాహనాలు నడిపేందుకు కారకులవుతున్నట్లు వెల్లడైంది. సరైన అవగాహన లేకుండా చిన్న వయస్సులో రోడ్లపై మోటారు వాహనాలు నడపడటం వలన ప్రమదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది కాబట్టి మోటారు వాహనాలు నడిపేందుకు నిర్దేశిత వయస్సును మోటారు వాహనాల చట్టంలో పొందుపర్చడం జరిగింది. ఈ మధ్య కాలంలో జరిగిన రహదారి ప్రమాదాల్లో మైనర్లు మృత్యువాత పడిన విషయం విధితమే. చిన్న వయస్సులో ప్రమాదాల భారినపడి విలువైన ప్రాణాలు కోల్పోవడం అత్యంత భాదాకరం, శోచనీయం.

కాబట్టి తల్లిదండ్రులు మైనర్లకు మోటారు వాహనాలు నడిపేందుకు ప్రోత్సహించకుండా హితవు చెప్పాలి. మైనర్లు లైసెన్స్‌లు లేకుండా రోడ్లపై వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేయడంతో పాటు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను లేదా సంబంధిత వాహన యజమానిని మోటారు వాహనాల చట్టప్రకారం బాధ్యులను చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము.

-- xx --